**విలేఖరులు కావలెను**

తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న 'సూర్య ప్రభ' ఈ-పేపర్‌లో పని చేయుటకు జిల్లా, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు.

ఫోన్ - 8985829417

# సూర్య ప్రభ

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 2 సంచిక: 8 | ఎడిటర్ : ఇ.సంజీవరెడ్డి | గురువారం, జూలై 3 2025 | పేజీలు : 4




తాడ్వాయి: ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం మహా జాతర తేదీలను పూజారుల సంఘం ప్రకటించింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరగనుంది. 28న సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు, 29న సమ్మక్క తల్లి చిలకలగుట్ట నుంచి గద్దెలకు చేరుకుంటారు. 30న భక్తులు మొక్కులు చెల్లించుకుంటారని పూజారుల సంఘం తెలిపింది. 31న అమ్మవార్ల వనప్రవేశం ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.




హైదరాబాద్ : తెలంగాణలో ఉప ఎన్నిక తప్పేలా లేదు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం తో ఆ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యంగా కనిపిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే పార్టీలు చర్చలు మొదలు పెట్టాయి. సిట్టింగ్ సీటును బీఆర్ఎస్ కాపాడుకోవటానికి సెంటిమెంట్ అస్త్రం బయటకు తీస్తోంది. కంటోన్మెంట్ తరహాలోనే ఈ సీటులో పాగా వేయాలని కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. అనూహ్యంగా ఈ బైపోల్ లో టీడీపీ పోటీ చేయటానికి సిద్దం అవుతున్నట్లు తెలుస్తోంది. మిత్రపక్షాలు జనసేనతో పాటుగా బీజేపీతో చర్చలు సాగుతున్నాయి. అభ్యర్ధి పైనా ఒక అంచనాకు వచ్చినట్లు పార్టీ ముఖ్య నేతల సమాచారం.

**మారుతున్న లెక్కలు...** సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం తో జూబ్లీ హిల్స్ బైపోల్ పైన ప్రధాన పార్టీలు చర్చలు.. లెక్కలు మొదలు పెట్టాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అక్టోబర్ నెలాఖరులో జరిగే అవకాశం ఉంది. దీనికి సంబంధించి సెప్టెంబర్ లో షెడ్యూల్ విడుదల అవుతుందని అంచనా. కంటో న్మెంట్ సీటు తరహాలోనే జూబ్లీహిల్స్ స్థానం దక్కించుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇప్పటికే ఈ స్థానంలో పరిస్థితుల అధ్యయనం.. నిర్ణయాల కోసం పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు, వివేక్ తో సీఎం రేవంత్ ఒక కమిటీ ఏర్పాటు చేసారు. 2009 లో ఏర్పాటు అయిన ఈ నియోజకవర్గం నుంచి

## అభ్యర్థిగా నందమూరి వారసురాలు..!?

మాగంటి గోపీనాథ్ మూడు సార్లు గెలిచారు. 2014 లో టీడీపీ నుంచి గెలవగా, ఆ తరువాత బీఆర్ఎస్ లోకి వెళ్లారు. 2018,2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు.

**పార్టీల కసరత్తు...** ఖైరతాబాద్ నుంచి విడిపోయి 2009 లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఏర్పాటు అయింది. 2009 లో పీ విష్ణువర్ధన్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక, ఇప్పుడు బైపోల్ లో కాంగ్రెస్ నుంచి అజారుద్దీన్, పీజేఆర్ కుమార్తె విజయా రెడ్డి, నవీన్ యాదవ్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఇక్కడ ముస్లిం మైనార్టీ ఓటింగ్ కీలకం. కాంగ్రెస్ - ఎంఐఎం మధ్య పోటీ పైన అంగీకారం కుదిరితే మొత్తం లెక్కే మారిపోవటం ఖాయంగా కనిపిస్తోంది.


అయితే, మాగంటి గోపీనాథ్ కుటుంబం నుంచే తమ పార్టీ అభ్యర్ధిగా పోటీలో నిలపాలని బీఆర్ఎస్ భావిస్తోంది. సాధ్యం కాకుంటే మాజీ ఎమ్మెల్యే విష్ణుకు సీటు కేటాయించే ఛాన్స్ ఉంది. ఈ సారి అనూహ్యంగా టీడీపీ సైతం ఈ నియోజకవర్గంలో పోటీకి సిద్దం అవుతున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో సామాజిక సమీకరణాలు.. ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భావిస్తున్నారు.

**బరిలో టీడీపీ..!...** గోపీనాథ్ మరణం సమయంలో ఏపీ మంత్రి లోకేష్.. మాగంటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏపీలో సక్సెస్ అయిన ఎన్డీఏను తెలంగాణలోనూ విస్తరించాలనే ప్రతిపాదన ఉంది. త్వర లో గ్రేటర్ ఎన్నికలు జరగనున్నాయి. దీనికి ముందు జరుగుతున్న ఈ ఎన్నికతోనే పొత్తు ప్రారంభించాలనే ఆలోచన జరుగుతోంది. దీంతో,జూబ్లీహిల్స్ బైపోల్ లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్ధిని బరిలో నిలపాలని భావిస్తున్నారు. అందులో భాగంగా టీడీపీ నుంచి నందమూరి సుహాసిని పేరు పరిశీలనలో ఉందని పార్టీలో ప్రచారం సాగుతోంది.టీడీపీలో సుహాసిని క్రియాశీలకంగా ఉన్నారు. నందమూరి వారసురాలిగా సీటు ఇస్తే కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు.

బీజేపీ సైతం ఇక్కడ నుంచి దీపక్ రెడ్డిని పోటీలో దింపాలని భావి స్తోంది. ప్రస్తుతం చర్చల స్థాయిలో ఉన్న ఈ ప్రతిపాదనల పైన మూడు పార్టీల అధినాయకత్వం చర్చించి.. తుది నిర్ణయం తీసుకోనుంది. ఇదే జరిగితే హైదరాబాద్ కేంద్రంగా కొత్త రాజకీయం మొదలు కానుంది.

# విద్య, వైద్యానికే అధిక ప్రాధాన్యం: సీఎం రేవంత్

## బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రిని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జులై 2: నగరంలోని బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు (బుధవారం) ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నగర ప్రజలకు రెండో అతిపెద్ద హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని అభినందించారు. హైదరాబాద్, తెలంగాణకు నాగేశ్వర్ రెడ్డి గొప్ప పేరు తీసుకొచ్చారని.. ఆయన సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ ఇచ్చిందని తెలిపారు. నాగేశ్వర్ రెడ్డి భారతరత్నకు అర్హులన్నారు. ఆయనకు భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. 66 దేశాల నుంచి పేషంట్స్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్సకు వస్తున్నారని ఇది గర్వకారణమన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నామని.. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్‌గా ఉంటుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని.. అందులో భాగంగానే డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారుడిగా నియమించామన్నారు. తెలంగాణ రాష్ట్రం చేపట్టే ప్రణాళికలో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కూడా భాగస్వాములు కావాల్సిందిగా ముఖ్యమంత్రి కోరారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఉందని.. ఇందుకు సరైన విధానంతో ముందుకు వెళుతున్నామని వెల్లడించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు హెల్త్ ప్రొఫైల్ కార్డును క్రియేట్ చేయాలని భావిస్తున్నామన్నారు. ఒక యూనిక్ ఐడీతో ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఉంటాయని తెలిపారు. ఒకప్పుడు ఉన్న ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థపోయి ఇప్పుడు స్పెషలిస్ట్ డాక్టర్స్ రోజులు వచ్చాయన్నారు. హెల్త్ ప్రొఫైల్ క్రియేట్ చేయడం ద్వారా దీన్ని బ్రేక్ చేయొచ్చని సీఎం అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడగలుగుతున్నామని చెప్పడానికే మిస్ వరల్డ్ పార్టిసిపెంట్స్‌కు ఏఐజీ హాస్పిటల్ విజిట్ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. గోశామహల్‌లో నూతన ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించబోతున్నామని.. పనులు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. నిర్మాణంలో ఉన్న వివిధ ఆసుపత్రులు పూర్తైతే మొత్తం 7 వేల పడకలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తామని స్పష్టంచేశారు. వైద్య రంగం అభివృద్ధికి రూ.11500 కోట్లు కేటాయించామని.. రూ.21500 కోట్లు విద్యా రంగం అభివృద్ధికి కేటాయించామని తెలిపారు. పేదలకు ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలనే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాని పేర్కొన్నారు. వైద్యులు ఏడాదిలో ఒక నెల రోజులు సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించాలన్నారు. సాంకేతిక రంగంలో ప్రపంచంలో హైదరాబాద్ కూడా ఒక వేదికగా మారిందని అన్నారు. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి హైదరాబాద్‌కు డైరెక్ట్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని.. కనెక్టివిటీ పెరిగితే హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.




హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పాశమైలారం పేలుడు ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త బి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఈ కమిటీలో సభ్యులుగా చీఫ్ సైంటిస్ట్ టి. ప్రతాప్‌కుమార్, విశ్రాంత శాస్త్రవేత్త సూర్యనారాయణ, పుణెకి చెందిన భద్రతాధికారి సంతోష్ ఘుగే ఉన్నారు. పాశమైలారం ప్రమాదానికి గల కారణాలతో పాటు కర్మాగారాల భద్రతా నియమావళి పాటించారా? లేదా? అనే అంశాలను కమిటీ తెలుసుకోనుంది. ఈ ఘటనపై నెలరోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. భవిష్యత్తులో రసాయన కర్మాగారాల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించాలని ప్రభుత్వం కోరింది. ఈ కమిటీకి డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సహకారం అందించాలని ఆదేశించింది. మరోవైపు సిగాచి పరిశ్రమ వద్దకు మంత్రి దామోదర రాజనర్సింహ, ఆ పరిశ్రమ ప్రతినిధులు వెళ్లారు. ఘటనాస్థలం నుంచి శిథిలాల తరలింపు ప్రారంభమైంది. ఇది ఇలా ఉండగా ప్రమాదంపై సిగాచీ పరిశ్రమ ప్రకటన విడుదల చేసింది. పేలుడు కారణంగా 40 మంది మృతి చెందినట్లు పేర్కొంది. మరో 33 మంది గాయపడినట్లు తెలిపింది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇస్తామని ప్రకటించింది.

గాయపడిన వారికి పూర్తి వైద్యం అందిస్తామని, అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చింది. కార్మికులకు అన్ని రకాల బీమా క్లెయిమ్‌లు చెల్లిస్తామంది. క్షతగాత్రుల వైద్య ఖర్చులు భరిస్తామని.. వారి కుటుంబ పోషణ చూస్తామని పేర్కొంది. సిగాచీ తరఫున కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ప్రమాదంపై స్టాక్‌మార్కెట్లకు ఆయన లేఖ రాశారు. ఈ ఘటనకు రియాక్టర్ పేలుడు కారణం కాదని తెలిపారు. ప్రభుత్వ విచారణ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. 3 నెలల వరకు ప్లాంట్‌లో కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు వివేక్ కుమార్ పేర్కొన్నారు.




# సరికొత్త అస్త్రాన్ని సిద్ధం చేస్తున్న భారత్..

# పాక్ గుండెలను చీల్చేలా..!

ఇటీవల ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్న అమెరికా.. శక్తివంతమైన బీ2 బాంబర్లతో ఇరాన్‌లోని మూడు అణు స్థావరాలపై దాడులు చేసిన సంగతి తెలిసిందే. మాసివ్ ఆర్డినెన్స్ పెనెట్రేటర్స్‌తో అమెరికా జరిపిన ఆకస్మిక దాడుల కారణంగా ఇరాన్‌లోని అణుస్థావరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

అత్యంత సురక్షితంగా పరిగణించే బంకర్లను సైతం ఈ బస్టర్లు నాశనం చేయగలవు. ఇరాన్‌పై అమెరికా దాడుల నేపథ్యంలో.. భారత్ కూడా కొత్త తరం బంకర్ బస్టర్ క్షిపణులను డెవలప్ చేస్తోంది. శత్రు దేశాల్లోని భూగర్భ లక్ష్యాలను ఛేధించడమే లక్ష్యంగా ఈ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకోసం డీఆర్‌డీవో అధునాతన అగ్ని-5 బాలిస్టిక్ క్షిపణి వేరియంట్‌లో మార్పులు చేస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. డీఆర్‌డీవో అభివృద్ధి చేస్తున్న ఈ క్షిపణి 7500 కేజీల బరువైన వార్ హెడ్‌ను కలిగి ఉంటుంది. ఇది భూగర్భంలో 100 మీటర్ల లోతు వరక చొచ్చుకుపోయి లక్ష్యాలను ధ్వంసం చేస్తుంది. మన పొరుగున ఉన్న పాకిస్థాన్, చైనాల్లోని కమాండ సెంటర్లు, క్షిపణి నిల్వ కేంద్రాలు, ఇతర భూగర్భ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఈ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నారు.

"బంకర్ బస్టర్‌లు అంటే భూమి లోపల బాగా లోతుగా, పటిష్టంగా నిర్మించిన సైనిక బంకర్లు, కమాండ్ సెంటర్‌లు, క్షిపణి నిల్వ కేంద్రాలు, ఆయుధ నిల్వ సదుపాయాలు వంటి లక్ష్యాలను ధ్వంసం చేయడానికి రూపొందించిన ప్రత్యేక క్షిపణులు లేదా బాంబులు." డీఆర్‌డీవో రూపొందిస్తున్న అగ్ని-5 క్షిపణి పరిధి 5,000 కిలోమీటర్ల కంటే ఎక్కువే. 7,500 కిలోల బరువున్న సాంప్రదాయ వార్‌హెడ్‌ను ఈ క్షిపణి కలిగి ఉంటుంది. అయితే మరింత ఎక్కువగా పేలోడ్‌లను మోసుకెళ్లడం కోసం, కచ్చితత్వాన్ని మెరుగుపర్చడం ఈ క్షిపణి పరిధిని 2500 కిలోమీటర్లకు తగ్గించారు. అగ్ని-5 రెండు కొత్త వెర్షన్లను అభివృద్ధి చేస్తున్నారు. ఒకటి ఉపరితల లక్ష్యాలపై గగనతలంలో పేల్చడానికి రూపొందించింది కాగా.. మరొకటి భూమిలోకి లోతుగా చొచ్చుకుపోయేలా రూపొందించినది. ఇది అమెరికా GBU-57ను పోలి ఉంటుంది. ఈ క్షిపణి 8 టన్నుల వరకు పేలోడ్‌ను కలిగి ఉంటుంది. ఇది ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సాంప్రదాయ వార్‌హెడ్‌లలో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. అమెరికా తన బంకర్-బస్టర్ బాంబులను చేరవేయడానికి పెద్ద బాంబర్ విమానాలపై ఆధారపడుతుంది. అయితే భారతదేశం క్షిపణి ఆధారిత డెలివరీ వ్యవస్థను ఎంచుకోవడం గమనార్హం. దీని వల్ల దాడికయ్యే వ్యయం తక్కువ కావడం మాత్రమే కాకుండా ఆపరేషనల్ ఫ్లెక్సిబిలిటీని, సర్వైవబిలిటీని పెంచుతుంది. అగ్ని-5 క్షిపణులు మాక్ 8 నుంచి మాక్ 20 వేగంతో ప్రయాణిస్తాయి. అంటే గంటకు 9,878 కిలోమీటర్ల నుండి 24,700 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఇది ప్రపంచంలోని అత్యంత అధునాతన ఆయుధ వ్యవస్థలతో సమానం.

**ఏమిటీ బంకర్ బస్టర్లు?..** భూమి లోపల లోతుగా, అత్యంత పటిష్టంగా ఉన్న సైనిక బంకర్లు, కమాండ్ సెంటర్లు, క్షిపణి నిల్వ డిపోలు, ఆయుధ నిల్వ కేంద్రాల లాంటి లక్ష్యాలను రూపొందించిన ప్రత్యేకమైన మిస్సైళు లేదా బాంబులను బంకర్ బస్టర్‌లు అంటారు. ఇవి కాంక్రీట్ పొరలు, రాతి గోడలు, మట్టి పొరలను చీల్చుకుంటూ లోపలికి చొచ్చుకొని వెళ్లి పేలిపోతాయి. అమెరికా సైన్యం వద్ద ఉన్న అత్యంత శక్తివంతమైన బంకర్ బస్టర్ 3 వేల పౌండ్ల బరువైన మాసివ్ ఆర్డినెన్స్ పెనెట్రేటర్ (ఎంఓపీ). ఇటీవల ఇరాన్‌లోని అణుకేంద్రాలపై ఈ ఎంఓపీలనే అమెరికా ప్రయోగించింది. మందపాటి స్టీల్ తయారు చేసిన, అధిక పేలుడు పదార్థాలతో నిండిన అమెరికా బంకర్ బస్టర్లలో డిలే ఫ్యూజులు ఉంటాయి. వీటి సాయంతో బాంబు ఎప్పుడు పేలాలో నిర్ణయించొచ్చు. ఈ పొడవైన ఫ్యూజ్.. బాంబు పేలడానికి ముందు మరింత లోతుగా చొచ్చుకెళ్లడానికి వీలు కల్పిస్తుంది. దీని వల్ల ఉపరితలానికి లోపల ఉన్న లక్ష్యాలను నాశనం చేసే సామర్థ్యం పెరుగుతుంది.

ఈ బాంబులను అభివృద్ధి చేయడానికి అమెరికా విస్తృతంగా పరీక్షలు నిర్వహించింది. అమెరికా బలగాలు మాక్ అండర్‌గ్రౌండ్ ఫెసిలిటీస్‌పై వందలాది పరీక్షలు చేపట్టాయి. టన్నెల్స్ గుండా ప్రయాణించి.. భూమి ఉపరితలం కిందనున్న కీలక పరికరాలను సమర్థవంతంగా నాశనం చేసే సామర్థ్యాన్ని కలిగి ఆశించిన స్థాయిలో లబ్ధి పొందే వరకు అమెరికా ప్రయోగాలు నిర్వహించింది.

# కుట్టు.. ఉపాధికి మెట్టు

భువనగిరి : మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వ తీసుకుంటున్న నిర్ణయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. డీఆర్‌డీఏ పర్యవేక్షణలో జిల్లా, మండల మహిళా సమాఖ్యల ద్వారా స్కూల్ యూనిఫామ్ కుట్టే పనులు జరుగుతున్నాయి. గత ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను మహిళా సంఘాల్లోని ఔత్సాహిక మహిళలతో కుట్టిస్తున్న విషయం విధితమే. దుస్తులు కుట్టగా ఛార్జీల కింద గత ఏడాది సుమారు 900 మందికిపైగా మహిళా సంఘాల సభ్యులకు రూ.75 లక్షలు సముపార్జించగా.. ఈ ఏడాది తొలి విడతగా రూ.63.26 లక్షలు ఛార్జీల కింద విడుదలయ్యాయి.

ఇంకా ప్రవేశాలు కొనసాగుతున్నాయి. ఈ సారి విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున కూలి డబ్బులు కూడా పెరగనున్నాయి. జిల్లాలో సుమారు 920 మంది మహిళా సంఘాల సభ్యులు ఈ పనిలో నిమగ్నమయ్యారు. వీరిలో 350 మంది కట్టింగ్, దుస్తులకు ఖాజాలు, గుండీలు కుట్టడంతో పాటు దుస్తులను కూడా కుడుతున్నారు. పాఠశాలలు, హాస్టల్ విద్యార్థులకు జతకు రూ.75, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థుల యూనిఫామ్ కుట్టినందుకు రూ.100 చొప్పున కూలీ ఇస్తున్నారు.

మండలానికి రెండు చొప్పున కట్టింగ్ కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఖాజాలు, గుండీలు కుట్టేందుకు ప్రత్యేక మిషన్లు సమకూర్చారు. కుట్టులో అనుభవం ఉన్న మహిళా సంఘాల సభ్యులు ఇళ్ల వద్దనే బాల, బాలికల దుస్తులను కుట్టి మండల సమాఖ్యలు



సంబంధిత పాఠశాలలు, గురుకులాలకు ప్యాకింగ్ చేసి పంపిస్తున్నారు. విద్యాశాఖ ఆధీనంలోని పాఠశాలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, టీజీఆర్ఈఎస్ సంస్థల విద్యార్థులకు 37,212 జతలు అప్పగించారు. గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల విద్యార్థులకు 1364 జతలు, బీసీ హాస్టల్ విద్యార్థులకు 738 జతలు కుట్టు పూర్తయి విద్యార్థులకు ఇచ్చారు. జిల్లా విద్యాశాఖ, సంక్షేమ శాఖల జిల్లా అధికారులు ఇచ్చిన ఇండెంట్ ప్రకారం గత రెండు నెలలుగా వీరు ఇదే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 79,696 జతల దుస్తులను కుట్టించి ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటికే పాఠశాలల విద్యార్థులకు 39,314 జతల దుస్తులను కుట్టి అందజేశారు.

**మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా : టి.నాగిరెడ్డి, డీఆర్‌డీవో**

మహిళకు ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా మహిళా సమాఖ్యల ద్వారా ఈ కార్యక్రమం చేపట్టాం. సెర్ప్ సంస్థ ఆదేశాల మేరకు కుట్టులో నైపుణ్యం ఉన్న మహిళా సంఘాల సభ్యులు 920 మందిని గుర్తించి వారికి శిక్షణ ఇచ్చాం. ఇళ్ల వద్దే ఉంటూ వీటిని కుడుతూ జతకు రూ.75 సంపాదిస్తున్నారు.

# నైపుణ్యమస్తు!

ఖమ్మం : యువతలో కంప్యూటర్, కృత్రిమ మేధ నైపుణ్యాలు పెంపొంది ంచి స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరచటానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పదోతరగతి అర్హతతోనే అధునాతన సాంకేతిక శిక్షణనిచ్చి భవితపై భరోసా కల్పిస్తోంది. పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)గా మార్చగా.. అందులో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల చొరవతో నాలుగు ఏటీసీలు మంజూరయ్యాయి. వీటికి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేసింది.

**మొదటి విడత కేంద్రాల్లో ప్రవేశాలు**

కార్మిక ఉపాధి శిక్షణ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో టాటా టెక్నాలజీ లిమిటెడ్(టీటీఎల్) భాగస్వామ్యంతో రాష్ట్రంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)లను ఏర్పాటుచేస్తున్నారు. మొదటి విడతలో ఖమ్మం, మణుగూరు, రుద్రంపూర్(కొత్తగూడెం), కృష్ణసాగర(బూర్గంపాడు) ఐటీఐలను ఏటీసీలుగా మార్చారు. ఆయాచోట్ల భవన నిర్మాణాలు తుది దశకు చేరాయి. యంత్రాలు, ఇతర పరికరాలు వచ్చాయి. వీటిని అమర్చాల్సి ఉంది. ఇప్పటికే ఆరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల్లో విద్యార్థులు చేరగా శిక్షణ ఇస్తున్నారు. ఏటీసీలలో పాత ఐటీఐ కోర్సులతో పాటు అదనంగా అధునాతన ఆరు కోర్సులు ఉంటాయి.

**స్థలాల అన్వేషణ**

రాష్ట్ర ప్రభుత్వం టీటీఎల్‌తో కలిసి తెలంగాణలో మరో 46 ఏటీసీలను ఏర్పాటు చేస్తోంది. వీటిలో జిల్లాకు నాలుగు కేంద్రాలు మంజూర య్యాయి. పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం, వైరా నియోజక వర్గం ఏన్కూరు మండలం తూతక్కపేట, మధిర నియోజకవర్గం సిరిపురం, సత్తుపల్లి



నియోజకవర్గం తుంబూరులో ఇవి ఏర్పాటు కానున్నాయి. వీటికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. ఒక్కో కేంద్రానికి రూ.45.15కోట్లు వెచ్చించనుంది. స్థలాలను అధికారులు అన్వేషిస్తున్నారు. టీటీఎల్ తనవాటా కింద యంత్రాలు, సాఫ్ట్‌వేర్, టూల్స్, పరికరాలు అందించనుంది. వర్క్‌షాప్స్, బోర్‌వెల్స్, మున్సిపాల్టీ నుంచి నీరు, విద్యుత్తు సరఫరా, పనులు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, తరగతి గదులు, గ్రంథాలయం, ఫర్నిచర్, శిక్షణ, పుస్తకాలు, శానిటరీ, తదితరాలకు నిధులను ప్రభుత్వం సమకూరుస్తుంది.

**కోర్సుల వివరాలు**

ఏడాది కాలవ్యవధి

ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్

మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్

ఇంజినీరింగ్ డిజైన్ టెక్నీషియన్(ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ)

రెండేళ్ల వ్యవధి

వర్చువల్ ఎనాలసిస్(బీడీవీవీ), డిజైనర్(ఎఫ్ఈఎం)

కంప్యూటర్ న్యూమరిక్ కంట్రోలర్(సీఎన్‌సీ–కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌తో పరికరాల తయారీ)

మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్(ఎంఈవీ).

ఏటీసీలుగా మారిన ఐటీఐలలో పాత కోర్సులతోపాటు కంప్యూటర్ బేస్డ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. ఖమ్మం ఏటీసీలో యంత్రాలు అమర్చాల్సి ఉంది. ఇప్పటికే విద్యార్థులను చేర్చుకొని శిక్షణ ఇస్తున్నాం.

శ్రీనివాసరావు, ఐటీఐల జిల్లా కన్వీనర్

# మరమ్మతులు లేక.. విస్తరణకు నోచుకోక..



మంథని: మంథని మండలం సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీ వరకు రహదారి ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారింది. అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారిన దారిపై నీరు నిలవడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. అటు విస్తరణకు నోచుకోక, ఇటు మరమ్మతులు లేక వానాకాలంలో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

**రెండు జిల్లాలకు రాకపోకలు**

గతంలో వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు మట్టి దారి ఉండేది. పదేళ్ల కిందట సింగరేణి సంస్థ బిట్టుపల్లి శివారులోని అసైన్డ్ భూమిని సేకరించి రచ్చపల్లి, అక్కెపల్లి గ్రామాల నిర్వాసితులకు పునరావాస కాలనీ ఏర్పాటు చేసింది. రూ.2 కోట్ల వ్యయంతో తారు రోడ్డు నిర్మించింది. గతంలో ఈ రహదారిపై రోజుకు సుమారు 20 వాహనాలు నడిచేవి. ఈ మార్గంలో మంథని మండలం బిట్టుపల్లి, ధర్మారం, గోపాల్‌పూర్, చిన్నఓదాల, ముత్తారం మండలం సీతంపల్లి, ఖమ్మంపల్లి, జిల్లాలపల్లి గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. రెండేళ్ల కిందట ఖమ్మంపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల మధ్య మానేరుపై వంతెన అందుబాటులోకి రావడంతో రోజుకు దాదాపు వెయ్యి వాహనాలు నడుస్తున్నాయి.

**విన్నపాలు బుట్టదాఖలు**

రచ్చపల్లి, అక్కెపల్లి గ్రామస్థులకు పునరావాసం కల్పించిన సింగరేణి సంస్థ దాదాపు పదేళ్ల కిందట కాలనీ వరకు సింగిల్ రోడ్డు వేసింది. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టలేదు.

పునరావాస కాలనీ నిర్మాణం వరకే తమ బాధ్యత అని, రహదారి మరమ్మతుతో తమకు సంబంధం లేదని సింగరేణి అధికారులు చెబుతున్నారు. మరోవైపు రహదారిని ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించకపోవడంతో మరమ్మతుకు, విస్తరణకు నోచుకోవడం లేదు. రహదారిని రెండు వరుసలుగా విస్తరించాలని స్థానికులు పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లికి మధ్య 2 కిలోమీటర్ల దూరం ఉండగా సుమారు ఎనిమిది మలుపులున్నాయి. మలుపులు, గుంతలతో ఈ మార్గంలో వారానికి ఒక ప్రమాదం జరుగుతోంది.

**సీఆర్ఆర్ నిధులకు ప్రతిపాదనలు**

శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి

సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి వరకు రహదారి విస్తరణ కోసం సీఆర్ఆర్ నిధుల మంజూరుపై కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశముంది.

**శాశ్వత పరిష్కారం చూపాలి**

వేముల లక్ష్మయ్య, చిన్నఓదాల

రహదారిపై మలుపులున్న చోటనే గుంతలు పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు వరుసలుగా విస్తరించడం ద్వారా సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి. వానాకాలంలో ఈ మార్గంలో వెళ్లాలంటేనే భయమేస్తోంది.

# బాధితులకు భరోసా.. సీఈఐఆర్ అండ




గోదావరిఖని: ప్రస్తుత కాలంలో చరవాణులు ఎంత కీలకమో అందరికి తెలిసిందే. అలాంటిది చేతిలో ఉండాల్సిన ఫోన్ ఎవరైనా చోరీ చేస్తే.. లేదంటే ఎక్కడైనా పోతే తిరిగి దక్కించుకోవటం కష్టమే. కాని పోలీసు శాఖ ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్ పోయిన ఫోన్లు తిరిగి పొందటానికి ఎంతో ఉపయోగపడుతోంది. గతంలో అయితే సెల్‌ఫోన్ చోరీకి గురైతే తిరిగి మళ్లీ చేతికి రావటం కష్టమే. అలాంటిది ఎత్తుకెళ్లిన వారిని వెంటనే గుర్తించి వారి నుంచి స్వాధీనం చేసుకోవడానికి పోలీసు శాఖ ప్రవేశపెట్టిన సీఈఐఆర్ అప్లికేషన్ బాధితులకు భరోసా కల్పిస్తోంది.

**6,683 ఫిర్యాదులు**

రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో పోర్టల్ ప్రారంభమైన నుంచి 6683 ఫిర్యాదులు రాగా.. 2020 పోయిన సెల్‌ఫోన్‌లను బాధితులకు అప్పగించారు. చోరీకి గురైనా.. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లోని సిమ్‌కార్డు నంబరుతో బాధితులు వెంటనే మరో సిమ్ తీసుకోవాలి. వివరాలు సీఈఐఆర్(సెంట్రల్ ఎంక్వయిరీ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌లో నమోదు చేయాలి. లేదా పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు చేస్తారు. ఎవరైనా పోయిన ఫోన్‌ను వినియోగించిన వెంటనే ఎక్కడుందన్న సమాచారం పోర్టల్‌కు చేరుతోంది. ఏప్రిల్ 2023లో ఈ అప్లికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వివిధ ఠాణాల పరిధిలో వచ్చిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు పోలీసులు ట్రాక్ చేసి స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగిస్తున్నారు. తాజాగా కమిషనరేట్ పరిధిలో 120 సెల్‌ఫోన్‌లను అప్పగించారు. దీని కోసం సీసీఎస్, ఐటీ సెల్ పోలీసు బృందాలు ప్రత్యేక దృష్టి సారించి చోరీకి గురైన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను వివిధ ప్రాంతాల నుంచి స్వాధీనం చేసుకున్నారు.

**నమోదు చేయాల్సిన వివరాలు**

ఐఎంఏ నంబరు

కొనుగోలు చేసిన రశీదు బిల్లు

ఏదైనా గుర్తింపు కార్డు

ప్రతి ఠాణాలో ప్రత్యేక విభాగం

చోరీకి గురైన సెల్‌ఫోన్‌ల కోసం సీసీఎస్ పోలీసులతో పాటు ప్రతి ఠాణాలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశాం. బాధితులు వివరాలు అందిస్తే వాటిని అప్లికేషన్‌లో నమోదు చేశారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లో చోరీకి గురైన ఫోన్ బ్లాక్ అవుతోంది. వేరే సిమ్‌కార్డు వినియోగించిన సమాచారం అందుతోంది.

అంబర్ కిషోర్ ఝూ, రామగుండం సీపీ

# వన మహోత్సవానికి సన్నద్ధం

మెట్‌పల్లి: పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం ఏటా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతోంది. ఈ సారి గ్రామాల్లో, పట్టణాల్లో లక్ష్యం మేర మొక్కలు నాటేందుకు సమాయత్తమవుతున్నారు. వివిధ శాఖల భాగస్వామ్యంతో జిల్లాలో 48.98 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకనుగుణంగా ఆయా శాఖలకు లక్ష్యాలను కేటాయిస్తూ కార్యాచరణ రూపొందించారు.

జిల్లాలో 380 గ్రామ పంచాయతీలు, అయిదు పురపాలికలున్నాయి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి పంచాయతీలో ఒక నర్సరీ ఏర్పాటు చేసి 47,67,400 మొక్కల పెంపకం చేపట్టారు. అటవీ శాఖతో పాటు పురపాలికల్లోనూ నర్సరీల్లో మొక్కలు పెంచారు. సుమారు 76 రకాల మొక్కలను పెంచుతున్నారు. గ్రామాలు, పట్టణాల విస్తీర్ణం ఆధారంగా శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించారు. అవెన్యూ, కమ్యూనిటీ, కాలువలకు ఇరువైపులా, రైతుల పొలంగట్లు, ఇన్‌స్టిట్యూషన్ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో గుంతలు తవ్వే పనులు చేపడుతున్నారు. వర్షాలు తగినంత కురిస్తే మొక్కలు నాటాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే 1800 ప్రాంతాల్లో మొక్కలు నాటే ప్రాంతాలను గుర్తించారు. ఇంటింటికీ సుమారు 12 లక్షల మొక్కలు అందించేందుకు పూలు, పండ్ల రకాలకు చెందిన మొక్కలను సిద్ధం చేశారు. వన మహోత్సవాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా మొక్కలు నాటడమే కాకుండా సంరక్షణ కూడా ముఖ్యమని, అప్పుడే లక్ష్యం నెరవేరుతుందని



పలువురు అభిప్రాయపడుతున్నారు.

**నర్సరీల్లో పెంచిన రకాలు**

జామ, నిమ్మ, దానిమ్మ, మునగ, మామిడి, బాదం, కర్జూర, ఈత, మారేడు, ఉసిరి, చింత, సీతాఫలం, టేకు, వేప, గుల్‌మోహర్, కానుగ, కదంబ, వెదురు, సుబాబుల్, రేలా, అవిస, పొగడ, తుమ్మ, సీమచింత, శ్రీగంధం, జిత్రేగు, మందార, గులాబీ, మల్లె, అడవి తంగేడు, కరివేపాకు, స్పైడర్‌లిల్లీ, తులసి, పారిజాతం, కనకాంబరం, గన్నేరు.

# ఇక పక్కాగా డ్రైవింగ్ పరీక్షలు

ఖమ్మం : లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్నవారికి వాహన డ్రైవింగ్ పరీక్ష కఠినతరం కానుంది. రవాణాశాఖ కార్యాలయాల్లో పరీక్ష సమయంలో ఎలా పడితే అలా వాహనం నడిపితే ఇకపై లైసెన్సు ఇవ్వడం కుదరదు. రానున్న రోజుల్లో వాహన ప్రమాదాలను నియంత్రించాలనే లక్ష్యంతో పక్కాగా పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత విధానంలో మార్పులు చేర్పులు చేసేందుకు సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా 18 రవాణాశాఖ కార్యాలయాల్లో నూతన పద్ధతిని అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు మొదలైంది. ఇందులో ఖమ్మం జిల్లా రవాణాశాఖ కార్యాలయం సైతం ఉంది. త్వరలోనే నూతన డ్రైవింగ్ విధానం అమల్లోకి రానున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇది కార్యరూపం దాల్చితే డ్రైవింగ్ పరీక్షలు సక్రమంగా జరిగి అర్హులు మాత్రమే డ్రైవింగ్ లైసెన్సు పొందే అవకాశం ఉంటుంది.

**నడిపించేస్తున్నారిలా..!**

జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాల్లో ప్రస్తుతం టూవీలర్, త్రీవీలర్, ఫోర్‌వీలర్ వాహనాల లైసెన్స్‌లకు వాహనదారులు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ చేసుకొని వస్తే అధికారులు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి కౌంటర్ నంబర్ ఇస్తున్నారు. అనంతరం డ్రైవింగ్ పరీక్షకు వెళ్లాల్సి ఉంటుంది. చాలా సందర్భాల్లో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు అన్నింటినీ పూర్తిస్థాయిలో నడిపే అవకాశం ఉండటం లేదు. పెద్ద వాహనం నడిపితే చిన్నవి నడపకుండానే మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు లైసెన్సులను జారీ చేస్తుంటారు. ఆన్‌లైన్ పరీక్షలో ఉత్తీర్ణులైనా ట్రాక్, 8 అంకెపై నడపకపోతే లైసెన్సు మంజూరును



నిలిపివేయవచ్చు. చాలా సందర్భాల్లో ఇది జరగడం లేదు. నూతన విధానంతో దీనికి అడ్డుకట్ట పడనుంది.

**సెన్సార్ల వినియోగం**

ఇకపై డ్రైవింగ్ లైసెన్సు మంజూరు చేయాలంటే తప్పనిసరిగా సిమ్యులేటర్‌పై పరీక్ష పాస్ అవ్వాలి. ఖమ్మంలో గతంలో ఏర్పాటు చేసిన పరికరం మూలకు చేరింది. దీన్ని వినియోగంలోకి తేవాల్సి ఉంది. ఖమ్మం కార్యాలయంలో ప్రస్తుత డ్రైవింగ్ ట్రాక్ స్థానంలో అత్యాధునిక సదుపాయాలతో నూతన ట్రాక్‌ను నిర్మించేందుకు కసరత్తు చేపట్టనున్నారు. హెచ్, ఎస్, 8 ఆకారాలతో పాటు రివర్స్, ట్రాక్‌పై సక్రమంగా నడుపుతున్నారో లేదో తెలుసుకునేందుకు సీసీ కెమెరాలతో పాటు ఆధునిక సెన్సార్లను వినియోగించనున్నారు.

**త్వరలోనే అందుబాటులోకి..: వాకదాని వెంకటరమణ, ఆర్టీఓ, ఖమ్మం**

అధునాతన ట్రాక్‌తో పాటు సిమ్యులేటర్‌పై పరీక్షలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన సేవలు త్వరలోనే జిల్లాలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే కార్యాచరణ రూపొందించి పనులు చేపడతాం. జిల్లాలో సగటున ఒక్కరోజుకు డ్రైవింగ్ లైసెన్సులకు వచ్చే

దరఖాస్తులు: సుమారు 70–80

లెర్నింగ్ లైసెన్సులు: సుమారు 60–70

# మన్యం వాసులకు మంచి రోజులు

కొత్తగూడెం : ఆధునిక వైద్యసదుపాయాలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మన్యం వాసులకు మంచిరోజులు రానున్నాయి. ఇప్పటివరకు యూజీ వైద్యవిద్య ఉన్నచోటే పీజీ కోర్సులను ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది నుంచి నేరుగా పీజీ వైద్యకళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో యూజీ లేకుండానే పీజీ కళాశాలలు నెలకొల్పాలని నిర్ణయించగా.. అందులో భద్రాచలం పట్టణానికి చోటు కల్పించింది.

**బోధనాసుపత్రిగా ఏరియా వైద్యశాల**

పీజీ కళాశాల ఏర్పాటుతో భద్రాచలంలో 200 పడకలు కలిగిన ఏరియా వైద్యశాల పీజీ కోర్సుల కోసం బోధనాసుపత్రిగా మారనుంది. స్థానికంగా అధునాతన వైద్యసదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న గిరిజనులకు ఉన్నతస్థాయి వైద్యచికిత్స సులువుగా అందుతుంది. ప్రత్యేక వైద్యసదుపాయాలు(కార్డియాలజీ, న్యూరాలజీ, ఆర్థోపెడిక్స్ వంటివి) భద్రాచలం ప్రభుత్వాసుపత్రిలో లభ్యమవుతాయి. రోగులు ఖమ్మం, హైదరాబాద్ వంటి నగరాలకు ప్రయాణించాల్సిన అవసరం తగ్గుతుంది. ముఖ్యంగా పీజీ సీట్ల సంఖ్య పెరగటంతో జిల్లా యువతకు వైద్యవిద్యలో అవకాశాలు మెరుగుపడతాయి.

**జిల్లాకు మరో మణిహారమే..**

మారుమూల గిరిజన ప్రాంతాల్లో సేవలందించేందుకు వైద్యులెవరూ ఆసక్తి చూపించని ప్రస్తుత పరిస్థితుల్లో పీజీ వైద్యకళాశాల ఏర్పాటు.. వైద్యరంగం పరంగా జిల్లాకు మణిహారంగా మారనుంది. పీజీ కళాశాలలు ఎక్కువ సంఖ్యలో స్పెషలిస్టు డాక్టర్ల(ఎండీ, ఎంఎస్, డీఎం, ఎంసీహెచ్)ను తయారుచేస్తాయి. వీరు స్థానికంగా నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు అవకాశముంటుంది. కళాశాల, బోధనాసుపత్రి ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు, సహాయక సిబ్బంది సంఖ్య పెరుగుతుంది. పీజీ కళాశాలలు వైద్య పరిశోధనలను ప్రోత్సహిస్తాయి. దీనివల్ల కొత్త చికిత్స పద్ధతులు, ఔషధాలు అభివృద్ధి చెందుతాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా వ్యాపించే డెంగీ, మలేరియా, టీబీ రోగాల నివారణకు ఇవి సహాయపడతాయి.

**భద్రాచలం అభివృద్ధికి బాటలు..**

కళాశాల ఏర్పాటు కోసం రోడ్లు, విద్యుత్తు, అంతర్జాల సేవల వంటి మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాల కేంద్రాలు (వసతిగృహాలు, దుకాణాలు) పెరుగుతాయి. ఇవి స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయి. గిరిజన సమాజం ఆధునిక వైద్యవిద్య, సేవల్లో ఏకీకృతమవుతుంది. గిరిజన సంస్కృతికి గౌరవం లభిస్తుంది. పేద గిరిజనులకు ఆధునిక వైద్యం ఉచితంగా అందుతుంది. భద్రాచలంలో పీజీ వైద్యకళాశాల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందలేదు. వైద్యకళాశాల ఏర్పాటైతే వైద్యపరంగా జిల్లావాసులకు మంచిరోజులు వచ్చినట్లే. వివిధ విభాగాల్లో విద్యనభ్యసించేవారు ఉండటం వల్ల ప్రజలకు ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. డా.ఎం.రామకృష్ణ, సూపరింటెండెంట్, భద్రాచలం ఏరియా ఆసుపత్రి



# మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

పాశమైలారం: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో ప్రమాదంపై సిగాచీ పరిశ్రమ ప్రకటన విడుదల చేసింది. పేలుడు కారణంగా 40 మంది మృతి చెందినట్లు పేర్కొంది. మరో 33 మంది గాయపడినట్లు తెలిపింది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇస్తామని ప్రకటించింది. గాయపడిన వారికి పూర్తి వైద్యం అందిస్తామని, అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చింది. కార్మికులకు అన్ని రకాల బీమా క్లెయిమ్‌లు చెల్లిస్తామంది. క్షతగాత్రుల వైద్య ఖర్చులు భరిస్తామని.. వారి కుటుంబ పోషణ చూస్తామని పేర్కొంది. సిగాచీ తరఫున కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ప్రమాదంపై స్టాక్‌మార్కెట్లకు ఆయన లేఖ రాశారు. ఈ ఘటనకు రియాక్టర్ పేలుడు కారణం కాదని తెలిపారు. ప్రభుత్వ విచారణ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. 3 నెలల వరకు ప్లాంట్‌లో కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు వివేక్ కుమార్ పేర్కొన్నారు.

**పటాన్‌చెరు ఆసుపత్రికి వచ్చిన సిగాచీ డైరెక్టర్...** పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రికి సిగాచీ డైరెక్టర్ చిదంబరం వచ్చారు. సిగాచీ వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవన్ మృతదేహం తీసుకెళ్లేందుకు ఆయన వచ్చారు.

# పాశమైలారం ఘటన.. 18 మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు: మంత్రి దామోదర



పాశమైలారం: పాశమైలారంలోని పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇప్పటివరకు 36 మంది మరణించారని.. ఇంకా 11 మంది కార్మికుల ఆచూకీ దొరకడం లేదని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. పేలుడు సంభవించిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆచూకీ గల్లంతైనవారు బతికే అవకాశాలు తక్కువని పేర్కొన్నారు. 18 మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు జరుగుతున్నాయని వివరించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. సిగాచీ కంపెనీ యాజమాన్యం ప్రమాద స్థలికి వచ్చిందని.. వారితో చర్చించినట్లు దామోదర రాజనర్సింహ తెలిపారు. సిగాచీ పరిశ్రమను మంత్రితో పాటు ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సీనియర్ నేత జగ్గారెడ్డి తదితరులు పరిశీలించారు. విపత్తు నిర్వహణ సిబ్బందిని అడిగి ప్రమాదం తెలుసుకున్నారు. బాధితుల బంధువులను పరామర్శించి అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు.

# రేవంత్‌రెడ్డి.. తెలంగాణకు మరణశాసనం రాశాడు.. హరీష్‌రావు ఫైర్




హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు తాము రెడీ.. సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమా అని సవాల్ విసిరారు. బనకచర్లపై అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీస్తామని అన్నారు. ఇవాళ (బుధవారం) తెలంగాణభవన్‌లో హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో బనకచర్లపై చర్చ జరుగుతున్నప్పుడు తమ మైక్ కట్ చేయకూడదని కోరారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ ద్రోహి.. సీఎం హోదాలోనూ రేవంత్‌రెడ్డి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణలు చేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. రేవంత్‌రెడ్డి తెలంగాణకు పట్టిన అబద్ధాల వైరస్ అని మాజీ మంత్రి హరీష్‌రావు ఎద్దేవా చేశారు. బయట వారికి సద్దులు కడుతూ.. ఇంటి మనిషి కేసీఆర్‌పై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ .. హైదరాబాద్‌లో కాకుండా అమరావతి నుంచి ఇచ్చినట్లుందని విమర్శించారు. ఉత్తమ్ పీపీటీ.. ఏపీ సీఎం చంద్రబాబు తయారు చేశాడా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకున్న విషయాన్ని పీపీటీలో ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. అహంకారంతో మాట్లాడితే.. రేవంత్‌ను ప్రజలు పాతాళానికి తొక్కుతారని హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబుతో ఉన్న అనుబంధాన్ని రేవంత్‌రెడ్డి ఇంకా మర్చిపోలేకపోతున్నారని విమర్శించారు మాజీ మంత్రి హరీష్‌రావు. విభజన హామీల ముసుగులో ప్రజాభవన్ వేదికగా బనకచర్ల ఒప్పందం కుదిరిందని, ప్రజాభవన్ వేదికగా 2024 జులై 6వ తేదీన రేవంత్ తెలంగాణకు మరణశాసనం రాశారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపణలు చేశారు. సెప్టెంబర్ 23వ తేదీన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీసమేతంగా బెజవాడ పోయి బజ్జీలు తిని బనకచర్లకు పచ్చజెండా ఊపారని విమర్శించారు. బీఆర్ఎస్ పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వం బనకచర్లకు అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ చచ్చిన పాము అయితే.. ఎందుకు తమపై విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. కేసీఆర్ పేరు ఎత్తకుండా ఒక్కసారైనా రేవంత్‌రెడ్డి ఉండగలరా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా కాకుండా.. రేవంత్‌రెడ్డి ఇంకా ప్రతిపక్ష నేత మాదిరిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇరు రాష్ట్రాలు కూర్చుని ఆమోదయోగ్యంగా మాట్లాడుకుందామని మాత్రమే కేసీఆర్ అన్నారని తేల్చిచెప్పారు మాజీ మంత్రి హరీష్‌రావు. బీఆర్ఎస్ హయాంలో బనకచర్లపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని మాజీ మంత్రి హరీష్‌రావు క్లారిటీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డే సతీసమేతంగా ఉత్తమ్‌ను విజయవాడ పంపించారని ఆరోపించారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ సీటు కూడా గెలవలేదని.. అంతమాత్రాన ఆ పార్టీ చచ్చిన పాము అవుతుందా అని ప్రశ్నించారు. చచ్చిన పాము ముచ్చట్లు రేవంత్‌రెడ్డి రాహుల్ గాంధీకి చెప్పుకోవాలని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలేనని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం కాకుండా.. రాజకీయ ప్రయోజనాల కోసమే రేవంత్ మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బనకచర్లపై మంత్రి ఉత్తమ్ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌కు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను ఎందుకు పిలవలేదని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు.

# రిజర్వేషన్లు అమలు తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి



ఖమ్మం, జులై 02: 40 శాతం బీసీ రిజర్వేషన్లు ఆమోదం పొందిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు జులై 17వ తేదీన రైలు రోకో కార్యక్రమానికి పిలుపు నిచ్చామని తెలిపారు. ఈ రైలు రోకోలో అత్యధిక సంఖ్యలో పాల్గొని.. బీసీ రిజర్వేషన్లు ఉద్యమానికి మద్దతు తెలపాలంటూ ఖమ్మం జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా ఆమె పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క బీసీ బిడ్డ పాల్గొనాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తెలంగాణ రాష్ట్ర నూతన బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావుదే బాధ్యత అని కవిత స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా అంటేనే ఉద్యమాల ఖిల్లా అని గుర్తు చేశారు. అయితే వైరా నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఆలోచించండి.. అంతేకానీ బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసుల గురించి కాదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలకు కవిత చురకలంటించారు. పోలవరం - బనకచర్ల నీటి విషయంలో ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు మాట్లాడాలని ఈ సందర్భంగా కవిత డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ ఇస్తామని అనేక సభలలో ఆ పార్టీ నేతలు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మరణం బీఆర్ఎస్ పార్టీతోపాటు ఖమ్మం జిల్లాకు తీరని లోటన్నారు. మదన్ లాల్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని చెప్పారు. మదన్‌లాల్ కుటుంబానికి తమ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా కవిత భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా రైలు రోకోకు బీఆర్ఎస్ పార్టీ పిలుపు నిచ్చింది. అందులోభాగంగా ఇటీవల అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు.



# విద్యార్థి వీసాలకూ టైం లిమిట్..!

## విద్యార్థి వీసాలకూ 'టైం లిమిట్'.. అమెరికా కొత్త మెలిక..!

అమెరికాలో చదువుల కోసం ప్రయత్నిస్తున్న, అగ్రరాజ్యంలో ఉంటున్న విదేశీ విద్యార్థులపై మరో ఆంక్షల కత్తి వేలాడుతోంది. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను కఠినంగా అమలుచేస్తోన్న అగ్రరాజ్యం.. తాజాగా మరో మార్పు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. విద్యార్థి వీసాలకూ పరిమిత కాల గడువు విధించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రతిపాదనలు చేసింది. దీంతో విదేశీ విద్యార్థులకు కొత్త గుబులు పట్టుకుంది. ప్రస్తుతం ఎఫ్-1 వీసాలపై అమెరికాలో ఉన్న అంతర్జాతీయ విద్యార్థులు, జే-1 వీసాలపై వచ్చిన ఎక్స్ఛేంజ్ విజిటర్లకు 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' వెసులుబాటు ఉంది. అంటే.. వారు ఎంతకాలం చదవాలనుకుంటే లేదా ఇంటర్న్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలనుకుంటే.. అంతకాలం అగ్రరాజ్యంలో ఉండొచ్చు. ఎక్స్ఛేంజ్ విజిటర్స్‌గా వచ్చే విద్యార్థులు, ప్రొఫెసర్లు, స్కాలర్లు, స్పెషలిస్టులు, ట్రైనీలు, ఇంటర్న్‌లు, ఫిజీషియన్లకు కూడా ఈ సదుపాయం వర్తిస్తుంది. అయితే, ఈ ఫ్లెక్సిబుల్ స్టూడెంట్ వీసా సిస్టమ్‌లో మార్పులు తీసుకొచ్చేందుకు ఇప్పుడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ విభాగం సిద్ధమైంది. విద్యార్థి వీసాలకు కూడా గడువు విధించేలా 'పరిమిత కాల నివాస అనుమతి'తో కూడిన వీసాలను మంజూరుచేయాలని ప్రతిపాదించింది. అంటే, ఇకపై విద్యార్థి వీసాలకు కూడా టైం లిమిట్ విధించనున్నారు. దీంతో గడువు తీరిన తర్వాత వీసా పొడిగింపునకు విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలను సమీక్షించేందుకు ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ విభాగానికి పంపించారు. అనంతరం దీన్ని ఫెడరల్ రిజిస్ట్రీలో పబ్లిష్ చేస్తారు. ఆ తర్వాత ప్రతిపాదనలపై 30 లేదా 60 రోజుల వరకు ప్రజాభిప్రాయాలను స్వీకరించి తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రజల నుంచి ఎలాంటి అభిప్రాయాలు తీసుకోకుండానే తక్షణమే అమల్లోకి వచ్చేలా దీనిపై మధ్యంతర ఉత్తర్వులు కూడా జారీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

ఈ ప్రతిపాదనలపై న్యాయనిపుణులు, విద్యార్థుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ మార్పుల వల్ల విద్యార్థులపై అదనపు భారం పడుతుందని, అనవసరపు గందరగోళానికి దారితీస్తుందని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ మార్పులు అమల్లోకి వస్తే భారతీయ విద్యార్థులపై అధిక ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం 3.3లక్షల మందికి పైగా భారతీయులు అమెరికా వర్సిటీల్లో చదువుకుంటున్నారు.



# ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకా కారణం కాదు..!

దిల్లీ: కరోనా మహమ్మారి తర్వాత దేశంలో ఆకస్మిక మరణాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా 40 ఏళ్ల లోపు వారు కూడా కార్డియాక్ అరెస్ట్‌తో ప్రాణాలు కోల్పోతుండటం కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో ఐసీఎంఆర్, ఎయిమ్స్ వంటి సంస్థలు దీనిపై పరిశోధనలు చేపట్టి కీలక విషయాలు వెల్లడించాయి. ఈ మరణాలకు, కొవిడ్ వ్యాక్సిన్లతో ఎలాంటి సంబంధం లేదని తమ అధ్యయనాల్లో తేలినట్లు స్పష్టం చేశాయి. మునుపటి అనారోగ్య సమస్యల ప్రభావమే ఆయా వ్యక్తుల మరణాల్లో కీలక అంశమని పేర్కొన్నాయి.

ఈమేరకు అధ్యయనాల నివేదికలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది. 18-45 ఏళ్ల వయసు వారిలో ఆకస్మిక మరణాలు సంభవించడంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ), ఎయిమ్స్ పరిశోధనలు చేశాయి. 2023 మే-ఆగస్టు మధ్య 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పలు ఆసుపత్రుల్లో సర్వే చేశాయి. ఆరోగ్యంగా కన్పించినప్పటికీ 2021 అక్టోబరు నుంచి 2023 మార్చి మధ్య ఉన్నట్టుండి మరణించిన వారి డేటాను పరిశీలించాయి.

వీటిని అధ్యయనం చేసిన తర్వాత.. ఈ ఆకస్మిక మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్లతో ఎలాంటి సంబంధం లేదని గుర్తించినట్లు ఆయా సంస్థలు వెల్లడించాయి. "భారత్‌లో కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితం, సమర్థవంతమైనవి. వీటివల్ల దుష్ప్రభావాలు చాలా అరుదైన సందర్భాల్లో మాత్రమే కన్పించాయి. గుండె సంబంధిత ఆకస్మిక మరణాలకు అనేక కారణాలు ఉన్నాయి. జన్యుపరమైన సమస్యలు, జీవన శైలి, మునుపటి అనారోగ్యాలు.. ఇలా ఏవైనా కావొచ్చు" అని అధ్యయనాల్లో తెలిపాయి. ఈ ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలే కారణమంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, తప్పుదోవ పట్టించేవేనని పునరుద్ఘాటించాయి. ఆధారాల్లేకుండా చేసే ఇలాంటి ప్రచారాలు వ్యాక్సిన్లపై విశ్వసనీయతను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తంచేశాయి. కొవిడ్ మహమ్మారి సమయంలో ఈ టీకాల వల్లే ఎంతోమంది ప్రాణాలు నిలిచాయని గుర్తుచేశాయి.

# తాలిపేరు ప్రాజెక్టుకు జలకళ

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద నీరు వస్తుండటంతో జలకళ సంతరించుకుంది. ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌తో పాటు, తెలంగాణలో కురుస్తున్న తేలికపాటి వర్షాలకు జలాశయానికి బుధవారం వరద నీరు వచ్చి చేరింది. ఇప్పటికే ప్రాజెక్టు నిర్వహణ పనులను అధికారులు పూర్తి చేశారు. నిర్వహణ పనుల్లో భాగంగా ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లను పూర్తిగా తెరిచి ఉంచారు. దీంతో క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షంతో వరద నీరు జలాశయానికి భారీగా వస్తోంది. ప్రాజెక్ట్ స్పిల్‌వే నుంచి వరద నీరు జాలువారుతూ దిగువ గోదావరికి పరుగులు తీస్తోంది. మొన్నటి వరకు నీళ్లు లేక వెలవెలబోయిన జలాశయం వరద నీటితో కళకళ లాడుతోంది. త్వరలో ప్రాజెక్ట్ గేట్లను దించివేస్తామని ఏఈఈ సంపత్ తెలిపారు.





# బీవీ పట్టాభిరామ్‌కు ప్రముఖుల నివాళి

పంజాగుట్ట: ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ బీవీ పట్టాభిరామ్(75) మంగళవారం గుండెపోటుతో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు బంజారాహిల్స్ ఒమేగా ఆసుపత్రి నుంచి ఖైరతాబాద్ ఆనంద్ నగర్‌లోని నివాసానికి తీసుకువచ్చారు. విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవై సోమయాజులు, ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, రామకృష్ణ మఠ్‌కు చెందిన సుఖబోధానంద, పలువురు ప్రముఖులు ఆయనకు నివాళులర్పించారు.

# సినిమాను తలపించే బ్యాంకు దోపిడి.. చిన్న తప్పుతో..

కర్ణాటకలోని విజయ్‌పూర్ జిల్లాలో బ్యాంకు దోపిడీ జరిగింది. దొంగలు బ్యాంకు లాకర్‌లోని బంగారాన్ని ఎత్తుకెళ్లిపోయారు. బంగారం దొంగిలించిన లాకర్‌లో ఓ బొమ్మ పెట్టి వెళ్లారు. దొంగలు ఎత్తుకెళ్లిన ఆ బంగారం విలువ 53 కోట్ల రూపాయలు కావటంతో.. పోలీసులు కేసును సవాల్‌గా తీసుకున్నారు. దర్యాప్తు మొదలెట్టారు. అయితే, దొంగతనానికి కారణం అయిన వ్యక్తి.. పోలీసులు ఊహించిన దానికంటే ఈజీగా దొరికిపోయాడు. కేసు సాల్వ్ అయింది. ఇంతకీ లాకర్‌లో ఉంచిన బొమ్మకు దొంగతనానికి ఏంటి సంబంధం?.. పోలీసులు దొంగల్ని ఎలా పట్టుకున్నారు?... 2025, మే 25.. విజయ్‌పూర్ జిల్లా మనగౌలిలోని కెనరా బ్యాంకులో దొంగతనం జరిగింది. దొంగలు బ్యాంకు లాకర్‌లోంచి 53 కోట్ల రూపాయలు విలువ చేసే బంగారాన్ని దోచుకెళ్లారు. అంతేకాదు.. బంగారం దోచిన లాకర్‌లో క్షుద్రపూజలు చేసే బొమ్మను ఉంచి వెళ్లారు. బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అయితే, ఆ దొంగతనానికి.. లాకర్‌లో ఉంచిన బొమ్మకు సంబంధం ఏంటన్నది పోలీసులకు అర్థం కాలేదు. దొంగతనం జరిగిన రోజు బ్యాంకు చుట్టు పక్కల ఉన్న అన్ని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను తెప్పించుకున్నారు. వాటిని పరీక్షించారు. దొంగతనం జరిగిన రోజు ఓ కారు అనుమానాస్పదంగా కనిపించింది. దొంగతనం జరగడానికి ముందు.. దొంగతనం జరిగిన తర్వాత బ్యాంకు దగ్గర ఆ కారు తిరుగుతూ కనిపించింది. పోలీసులు ఆ కారు యజమాని వివరాలు కనుక్కున్నారు. ఆ కారు విజయ్ కుమార్ మిరియాలకు చెందిందిగా తేలింది. అతడి గురించి పూర్తి వివరాలు కనుక్కోగా అసలు విషయం బయటపడింది. మే 8వ తేదీ వరకు అతడు అదే బ్యాంకులో మేనేజర్‌గా పని చేశాడు. మే 9వ తేదీన వేరే బ్యాంకుకు ట్రాన్స్‌ఫర్ అయ్యాడు. వేరే బ్యాంకుకు ట్రాన్స్‌ఫర్ అయిన వ్యక్తికి దొంగతనం జరిగిన రోజు ఆ బ్యాంకు దగ్గర పనేముందని పోలీసులకు అనుమానం వచ్చింది. వెంటనే అతడ్ని అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగతనం తానే చేయించినట్లు ఒప్పుకున్నాడు. పోలీసులు అతడితో పాటు దొంగతనానికి పాల్పడ్డ మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 10 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. లాకర్‌లో పెట్టిన బొమ్మ గురించి ఆరా తీయగా.. కేసును తప్పుదోవ పట్టించడానికి అలా చేసినట్లు చెప్పారు.



# యూఎస్ ఇస్కాన్ టెంపుల్ పై కాల్పులు? అసలేం జరిగింది?

దాదాపు మూడున్నర దశాబ్దాల చరిత్రలో ఎప్పుడూ చోటుచేసుకోని సంఘటనలు ఇటీవల అమెరికాలో జరుగుతున్నాయి. అమెరికాలోని శ్రీశ్రీ రాధా క్రిష్ణ ఇస్కాన్ దేవాలయాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు జరుగుతున్నాయి. 1990లో ఈ దేవాలయాన్ని అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలోని ఉతాహ్ పరిధిలోని స్పానిష్ ఫోర్క్ లో నిర్మించారు. ఇదిలా ఉంటే.. ఇటీవల కాలంలో ఈ దేవాలయం మీద తరచూ దాడులు జరుగుతున్నాయి. తాజాగా ఈ దేవాలయం మీద గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. వీరు కాల్పులు జరిపిన సమయంలో భక్తులు.. అతిధులు ఆలయంలో ఉన్నట్లు ఇస్కాన్ వెల్లడించింది. సుమారు 20 నుంచి 30 వరకు తూటాలు ఆలయ తోరణాలు.. గోడల్లోకి దూసుకెళ్లాయి. గతంలోనూ ఈ ఆలయంపై దాడులు జరిగ్గా.. గడిచిన నెలలో (జూన్) మాత్రం ఏకంగా మూడుసార్లు దాడులు జరగటం గమనార్హం. తాజాగా జరిపిన కాల్పులు



ఆలయానికి తీవ్రంగా నష్టపరిచినట్లుగా ఇస్కాన్ పేర్కొంది. కాల్పుల ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని.. భక్తులకు, ఆలయ అధికారులకు తమ మద్దతు ఉంటుందని.. ఈ ఘటనపై స్థానిక అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ జనరల్ కోరింది. ఇస్కాన్ టెంపుల్ మీద జరిగిన దాడులు.. విద్వేషంతోనే జరిగినట్లు భావిస్తున్నారు. గతంలోనూ దాడులు జరిగినా.. ఇటీవల కాలంలో తరచూ దాడులు జరగటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్ని దశాబ్దాలుగా ఎలాంటి ఇబ్బందులు లేకున్నా.. ఇటీవల కాలంలో మాత్రం తరచూ దాడుల ఘటనలు జరుగుతున్నాయని ఇస్కాన్ దేవాలయ అధ్యక్షుడు వాయ్ వార్డెన్ వెల్లడించారు. శాన్ ఫ్రాన్సిస్కోలో మాత్రమే కాదు గత ఏడాది కాలిపోర్నియాలోని ఇస్కాన్ దేవాలయం మీదా దాడులు జరగటాన్ని గుర్తు చేస్తున్నారు. ఖలిస్థానీ ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా లాస్ ఏంజెల్స్ లోని హిందూ దేవాలయంపై దాడులు జరగటటం గమనార్హం. వరుస పెట్టినట్లుగా అమెరికాలోని హిందూ దేవాలయాలపై జరుగుతున్న కాల్పులపై అమెరికా ప్రభుత్వ స్పందన ఏమిటన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది.

# ఉక్రెయిన్ కు ఆ విషయంలో హ్యాండిచ్చిన ట్రంప్... తెరపైకి కీలక కారణం!



సుమారు మూడేళ్లుగా రష్యా – ఉక్రెయిన్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందనే విషయంపై ఇప్పటికీ స్పష్టత రావడం లేదు. ఉక్రెయిన్ తో చర్చలకు సిద్ధమంటూ ఇటీవల పుతిన్ ప్రకటించారు. అయితే.. ఇది ఎప్పుడు కార్యరూపం దాలుస్తుందనేది తెలియదు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ కు ట్రంప్ బిగ్ షాకిచ్చారు. అవును.. రష్యాతో భీకర యుద్ధం జరుగుతున్న వేళ ఉక్రెయిన్ కు ఓ బ్యాడ్ న్యూస్ వినిపించింది. ఇందులో భాగంగా.. ఇప్పటివరకూ భారీగా ఆయుధ సాయం చేస్తోన్న అమెరికా తాజాగా గట్టి షాకిచ్చింది. ఉక్రెయిన్ కు అవసరమైన కొన్ని రకాల ఆయుధాల సరఫరాను నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పెంటగాన్ అధికారులు ప్రకటన చేశారు. ఈ సందర్భంగా స్పందించిన రక్షణ శాఖ... ఈ ఆయుధాలను ఉక్రెయిన్ కు అందించడానికి గతంలో బైడెన్ ప్రభుత్వం అంగీకరించిందని.. అయితే, ఇటీవల తమ ఆయుధ నిల్వలను సమీక్షించిన తర్వాత.. ఉక్రెయిన్ కు ఇస్తామని హామీ ఇచ్చిన ఆయుధాల నిల్వలు చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించి.. ఇకపై పంపించొద్దని నిర్ణయించినట్లు తెలిపింది.

ఈ సందర్భంగా స్పందించిన వైట్ హౌస్ అధికార ప్రతినిధి అన్నా కేలీ... తమ సొంత అవసరాలు తీరిన తర్వాతే ఇతర దేశాలకు ఆయుధ సాయం చేయాలన్న అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే... ఉక్రెయిన్ కు అమెరిక నిలిపివేసిన ఆ ఆయుధాల వివరాలను అటు వైట్ హౌస్ కానీ, ఇటు రక్షణ శాఖ కానీ వెల్లడించలేదు. కాగా... రష్యా – ఉక్రెయిన్ మధ్య గత మూడేళ్లుగా కొనసాగుతున్న యుద్ధం ఇటీవల మరింత తీవ్రంగా మారుతున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో... ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో చర్చలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. మరోవైపు.. 2022 ఫిబ్రవరిలో రష్యాతో పోరు ప్రారంభమైన నాటినుంచి అమెరికా ఇప్పటివరకు కీవ్ కు 66 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధ, సైనిక సాయాన్ని అందజేసిందని అంటున్నారు. ఇంత సడన్ గా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోవడానికి ఇటీవల జరిగిన ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య యుద్ధం కూడా ఒక కారణమని అంటున్నారు. ఇందులో భాగంగా... ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధం కారణంగా 11 రోజుల్లోనే అమెరికా వద్ద ఉన్న అత్యాధునిక క్షిపణి వ్యవస్థల్లో సుమారు 15–20 శాతం వినియోగించినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా.. ఉక్రెయిన్ కు హ్యాండ్ ఇచ్చారు ట్రంప్ అని అంటున్నారు.

# ట్రంప్ నుంచి మరో సీజ్ ఫైర్ పోస్టు.. కండిషన్స్ అప్లై!

భారత్ – పాక్ మధ్య అణు యుద్ధాన్ని ఆపాను, ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం చేయించాను.. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే.. ప్రపంచ శాంతి కోసం తాను ఎన్నో సంఘర్షణలకు చరమగీతం పాడాను అని చెప్పుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో కాల్పుల విరమణ ఒప్పందం చేసినట్లు ప్రకటించారు. కాకపోతే కండిషన్స్ అప్లై! అవును... 2023 అక్టోబర్ నుంచి గాజాను గడగడలాడించేస్తున్న ఇజ్రాయెల్ ను సీజ్ ఫైర్ కు ఒప్పించినట్లు ట్రంప్ తెలిపారు. ఈ సందర్భంగా.. గాజాలో 60 రోజుల కాల్పుల విరమణ చేయడానికి అవసరమైన షరతులకు ఇజ్రాయెల్ అంగీకరించినట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆయన 'ట్రూత్'లో పోస్టు చేశారు. అయితే ఆ షరతులు ఏమిటి, ఎలాంటివి అనేది మాత్రం వెల్లడించలేదు. ఈ సందర్భంగా.. గాజాకు సంబంధించి ఇజ్రాయెల్ తో తమ ప్రతినిధులు సుదీర్ఘ, ఫలవంతమైన చర్చలు జరిపారని చెప్పిన ట్రంప్.. 60 రోజుల కాల్పుల విరమణ



ఖరారు చేయడానికి అవసరమైన షరతులకు ఇజ్రాయెల్ అంగీకరించిందని.. ఈ సమయంలో యుద్ధాన్ని పూర్తిగా ముగించేందుకు అన్ని పక్షాలతో కలిసి పనిచేస్తామని ప్రకటించారు. ఈ ప్రాంతంలో శాంతి కోసం కృషి చేస్తున్న ఈజిప్ట్, ఖతార్ లు తుది ప్రతిపాదన చేస్తాయని చెప్పిన ట్రంప్... ఇది పశ్చిమాసియాకు మంచిదని ఆశిస్తున్నట్లు తెలిపారు. హమాస్ సైతం ఈ డీల్ కు ఒప్పుకుంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక వేళ హమాస్ అంగీకరించకుంటే మాత్రం ఈ సమస్య మరింత జటిలం అవుతుందని ట్రంప్ వెల్లడించారు! అంటే... గాజాపై కాల్పుల విరమణ విషయంలో ఇప్పటికే ఇజ్రాయెల్ ఒప్పుకోగా.. హమాస్ నిర్ణయం కోసం వెయిటింగ్ అన్నమాట. మరి ట్రంప్ చేసిన ప్రకటనకు హమాస్ అంగీకరిస్తుందా.. లేక, ఇజ్రాయెల్ సైన్యం చేతిలో పాలస్తీనా ప్రజలను ఇంకా బలిపశువులను చేయడానికే నిశ్చయించుకుంటుందా అనేది వేచి చూడాలి! కాగా... 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్ లోకి చొరబడిన హమాస్ ఉగ్రవాదులు.. సుమారు 1,200 మందిని ఊచకోత కోసిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో.. సుమారు 251 మందిని బందీలుగా తీసుకెళ్లారు. దీంతో అప్పటినుంచి హమాస్ అంతమే లక్ష్యంగా గాజా స్ట్రిప్ పై ఇజ్రాయెల్ పై అవిరామంగా విరుచుకుపడుతోంది. ఈ నేపథ్యంలో... హమాస్ అగ్రనేతలను, కీలక కమాండర్లను, వేల మంది మిలిటెంట్లను హతమార్చింది! హమాస్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకారం.. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటి వరకు 56,647 మంది పాలస్తీనా పౌరులు మృతి చెందారు. ఇక ఈ ఐడీఎఫ్ దాడులతో పలు పట్టణాలు నామారూపాల్లేకుండా పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కాంక్రీట్ శిథిలాలుగా మారాయి.

## సినిమా 'షో'

# రష్మిక ది గర్ల్ ఫ్రెండ్ కి బంపర్ ఆఫర్..!


నేషనల్ క్రష్ రష్మిక మందన్న రీసెంట్ గా కుబేర తో మరో సూపర్ హిట్ అందుకున్న విషయం తెలిసిందే. కుబేర సినిమాలో రష్మిక రోల్ చాలా ఎక్కువ రన్ టైం తో ఉన్నా కూడా ఆమె ఇంపాక్ట్ సినిమా అంతా ఉంది. అందుకే రష్మిక ఈ సినిమా సక్సెస్ లో భాగమైంది అన్నట్టుగా చెప్పొచ్చు. అదీగాక రష్మిక సినిమాలో ఉంటో లక్ కలిసి వస్తుంది అన్నది మరోసారి కుబేరాతో ప్రూవ్ అయ్యింది. కుబేర సినిమా తెలుగులో సూపర్ హిట్ కాగా కోలీవుడ్ లో ఆశించిన రేంజ్ రీచ్ అందుకోలేదు. ఇదిలా ఉంటే రష్మిక కుబేర హిట్ అవ్వడంతో ఆమె చేస్తున్న నెక్స్ట్ సినిమాల మీద ఆ ఎఫెక్ట్ ఉంది. రష్మిక ప్రస్తుతం ది గర్ల్ ఫ్రెండ్ సినిమా చేస్తుంది. ఈ సినిమాలో దీక్షిత్ శెట్టి మేల్ లీడ్ గా నటిస్తున్నాడు. దసరా సినిమాలో అతని ప్రతిభ చాటాడు. ది గర్ల్ ఫ్రెండ్ లో రష్మికతో స్క్రీన్ షేర్ చేసుకుంటున్నాడు. ఐతే వరుస సినిమాలు హిట్లు కొడుతుండటం వల్ల రష్మిక చేస్తున్న ది గర్ల్ ఫ్రెండ్



సినిమాకు సూపర్ డిమాండ్ ఏర్పడింది. ది గర్ల్ ఫ్రెండ్ సినిమాను పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ఐతే రష్మిక ఉన్న ఫాం చూసిన హిందీ మేకర్స్ ఆమె నటిస్తున్న ది గర్ల్ ఫ్రెండ్ సినిమాను భారీ మొత్తానికి కొనేశారట. మిగతా భాషల్లో కూడా ఆ సినిమాకు మంచి బిజినెస్ జరుగుతుందని తెలుస్తుంది. రష్మిక సినిమాలో ఉంది అంటే నేషనల్ వైడ్ గా డిస్ట్రిబ్యూటర్స్ ఆసక్తి చూపిస్తున్నారు. ఆ ఇంపాక్ట్ తో ది గర్ల్ ఫ్రెండ్ సినిమా బిజినెస్ అనుకున్న దానికన్నా బాగా జరిగిందని తెలుస్తుంది. ది గర్ల్ ఫ్రెండ్ సినిమా కూడా హిట్ పడితే మాత్రం తప్పకుండా రష్మిక రేంజ్ మరింత పెరిగే ఛాన్స్ ఉంటుంది. ఇప్పటికే బాలీవుడ్ టాలీవుడ్ అన్న తేడా లేకుండా పాన్ ఇండియా లెవెల్ లో దూసుకెళ్తుంది.. రష్మిక ఫిమేల్ సెంట్రిక్ మూవీగా చేస్తున్న ది గ్రల్ ఫ్రెండ్ హిట్ అయితే బాలీవుడ్ లో కూడా ఇలాంటి మరిన్ని సినిమాలు చేసే ఛాన్స్ ఉంటుంది. ది గర్ల్ ఫ్రెండ్ సినిమాను రాహుల్ రవింద్రన్ డైరెక్ట్ చేస్తున్నాడు. రష్మిక ది గర్ల్ ఫ్రెండ్ రిలీజ్ ఎప్పుడు సినిమా అప్డేట్స్ ఎప్పుడిస్తారంటూ నేషనల్ క్రష్ ఫ్యాన్స్ సూపర్ ఎగ్జైటెడ్ గా ఉన్నారు.

# నా ఛాలెంజ్ ను యాక్సెప్ట్ చేస్తేనే కామెంట్స్ చేయండి





టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గత కొన్నాళ్లుగా సినిమాల కంటే సోషల్ మీడియా పోస్టుల ద్వారానే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. సోషల్ మీడియాలో తన శరీరాకృతి గురించి కామెంట్స్ చేసే వారికి సమంత గట్టి కౌంటర్ ఇచ్చారు. తనను విమర్శిస్తున్న వారికి ఫిట్‌నెస్ విషయంలో ఛాలెంజ్ చేస్తూ తాను జిమ్ లో చేస్తున్న పుల్ అప్స్ వీడియోను షేర్ చేశారు. రీసెంట్ గా సమంత ఓ అవార్డ్ ఫంక్షన్ లో పాల్గొనగా, ఆ ఈవెంట్ నుంచి పలు ఫోటోలు బయటకు రాగా, అందులో సమంత లుక్స్ చూసి చాలా మంది నెటిజన్లు సన్నగా అయిపోయావు, అనారోగ్యంగా కనిపిస్తున్నావంటూ కామెంట్స్ చేశారు. దీనిపై రెస్పాండ్ అవుతూ సమంత తన ఇన్‌స్టాలో ఓ స్టోరీని పెడుతూ తనను కామెంట్స్ చేసేవారికి సవాల్ విసిరారు. ఆ వీడియోలో సమంత ఎలాగైతే పుల్ అప్స్ చేశారో, తన గురించి నెగిటివ్ కామెంట్స్ చేసే వారు కూడా కనీసం మూడు పుల్ అప్స్ తీసి చూపించాలని, అలా చేసిన వాళ్లే తన గురించి కామెంట్స్ చేయాలని, లేని పక్షంలో తన గురించి మాట్లాడటం మానేయమని ఆ పోస్ట్ లో పేర్కొన్నారు సమంత. కాగా సమంత చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుంది. గత కొంతకాలంగా మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో బాధపడుతున్న సమంత, ఆ ట్రీట్‌మెంట్ లో భాగంగా తన ఒరిజినల్ లుక్ ను కాస్త కోల్పోయిన మాట నిజమే అయినప్పటికీ, నెటిజన్లు ఇష్టమొచ్చినట్టు కామెంట్స్ చేయడం ఏ మాత్రం కరెక్ట్ కాదు. ఇక సమంత కెరీర్ విషయానికొస్తే అమ్మడు త్వరలోనే రక్త్ బ్రహ్మాండ్ అనే సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సిరీస్ ఆగిపోయిందని గత కొన్నాళ్లుగా వార్తలొస్తుండగా, ఈ సిరీస్ కు సంబంధించిన కీలక సీన్స్ ను ఆల్రెడీ ఫినిష్ చేశామని, త్వరలోనే ఓ భారీ అవుట్‌డోర్ షెడ్యూల్ ను ప్లాన్ చేసినట్టు డైరెక్టర్లు రాజ్ అండ్ డీకే క్లారిటీ ఇచ్చారు.

# చీరకట్టులో అందాల చి.ల.సౌ

సుశాంత్ హీరోగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రూపొందిన 'చి.ల.సౌ' సినిమాతో రుహాని శర్మ హీరోయిన్‌గా ఇండస్ట్రీకి పరిచయం అయింది. ఆ సినిమాలో నటిగా తన ప్రతిభను కనబర్చింది. సాధారణంగా హీరోయిన్స్ స్కిన్ షో చేస్తేనే గుర్తింపు లభిస్తుంది. కానీ ఈ సినిమాలో ఆమె పూర్తిగా పద్దతైన పక్కింటి అమ్మాయిగా కనిపించినా కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అంతే కాకుండా ఇండస్ట్రీలోనూ మంచి గుర్తింపు సొంతం చేసుకుని వరుస సినిమా ఆఫర్లు దక్కించుకుంది. సోషల్ మీడియాలో ఈమెకు ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. హీరోయిన్‌గా ఒక మోస్తరు సినిమాల్లో నటించినప్పటికీ ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా 15 లక్షల మంది ఫాలోవర్స్‌ను కలిగి ఉంది. రుహాని శర్మ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటో షూట్‌ను షేర్ చేస్తూ ఉంటుంది.



సాధారణంగా హీరోయిన్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్కిన్ షో ఫోటో షూట్స్, బోల్డ్ లుక్ ఫోటోలు షేర్ చేస్తూ ఉంటారు. కానీ రుహానీ శర్మ మాత్రం చాలా అరుదుగా మాత్రమే స్కిన్ షో ఫోటోలు షేర్ చేస్తూ ఉంటుంది. ఎక్కువగా చీర కట్టు ఫోటోలు, నిండైన డ్రెస్‌లతో, ట్రెడీషనల్ లుక్‌లో కనిపిస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి చీర కట్టు ఫోటోలతో కన్నుల విందు చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ ఉంటారు. తాజా చీర కట్టు ఫోటోలతో చూపు తిప్పనివ్వడం లేదు. రుహాని శర్మ మరోసారి తన అందమైన చీర కట్టు ఫోటోలతో కవ్విస్తోంది. క్యాప్షన్ దొరకడం లేదు.. ఉత్తమమైనది ఆ స్థానాన్ని గెలుచుకుంటుంది నేను వేచి చూస్తున్నాను అంటూ తన చీర కట్టు ఫోటోలను షేర్ చేసింది. చీర కట్టు ఫోటోలతో ఎప్పటికప్పుడు రుహాని శర్మ ఆకట్టుకుంటూనే ఉంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు చీర కట్టు ఫోటోల కారణంగా మరింతగా కవ్విస్తుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న రుహానికి దక్కాల్సిన స్థాయిలో ఆఫర్లు దక్కడం లేదు అంటూ అభిమానులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈమధ్య కాలంలో తెలుగులో ఈమె లవ్ మీ సినిమాలో నటించింది.

Name of Premises : Venus Enclave, Block - 0, Quthbullapur City, Medchal Malkajgiri District - 500055, email : sanjeevreddyetlapuram@gmail.com. Cell : 8985829417